క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామికి లక్ష గులాబీల పూజ



భీమనపల్లిలో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామివారు

ఉప్పలగుప్తం: ధనుర్మాసం సందర్భంగా భీమనపల్లిలో ఉన్న భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం లక్ష గులాబీల పూజ నిర్వహించారు. అర్చకులు పెద్దింటి శ్రీనివాసాచార్యులు, ఈఓ కె.కార్తీక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేసి, లక్ష గులాబీలతో పూజ చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది. సాయంత్రం గరుడ సేవ నిర్వహించారు.

అర్జునరావు సేవలు ప్రశంసనీయం

యానాం: మున్సిపాలిటీలో 41 ఏళ్లుగా బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహించి, ఉద్యోగ విరమణ చేసిన కుంచనపల్లి అర్జునరావు సేవలు ప్రశంసనీయమని మున్సిపల్ కమిషనర్ అరుణ్‌ప్రకాశం అన్నారు. శుక్రవారం అర్జునరావు ఉద్యోగ విరమణ సత్కార సభ మున్సిపల్ ఉద్యోగుల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా అర్జునరావును దుశ్శాలువా, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రామకృష్ణ, యూనియన్ అధ్యక్షుడు నూకాంబరం, సత్యనారాయణ, గోపీనాథ్, శానిటరీ వర్కర్లు పాల్గొన్నారు.

టూరిజం శాఖ న్యూ ఇయర్ వేడుకలు

యానాం: పుదుచ్చేరి టూరిజం శాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 31 ఆదివారం రాత్రి హలో–2024 పేరిట న్యూఇయర్ వేడుకలను పర్యాటక శాఖకు చెందిన సీగల్స్ రెస్టారెంట్ ఆవరణలో నిర్వహిస్తున్నట్టు ఆర్‌ఏఓ మునిస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరోజు రాత్రి యువతీయువకులకు, పెద్దలకు, చిన్నారులకు వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. లైవ్ మ్యూజిక్ ఆర్కెస్ట్రా, డీజే అండ్ రాక్‌బ్యాండ్, డ్యాన్స్‌షోలు జరుగుతాయన్నారు. ప్రత్యేక ఆకర్షణగా ఫైర్ క్రాకర్స్ షో ఆరోజు అర్ధరాత్రి 12 దాటాక ఉంటుందన్నారు. ఎంట్రీ ఫీజుగా రూ.500 నిర్ణయించినట్టు తెలిపారు.

అసైన్డ్ భూములను ఆక్రమించారంటూ ధర్నా



దీక్ష చేస్తున్న ఆందోళనకారులు

అల్లవరం: కొమరగిరిపట్నం శివారు ఊటగుంట సావరంలోని అసైన్డ్ భూములు సర్వే నంబర్ 1025లో 5.64 ఎకరాలను గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకోవడంపై లబ్ధిదారులు శుక్రవారం నిరాహార దీక్ష చేపట్టారు. అసైన్డ్ భూముల వద్ద టెంట్ ఏర్పాటు చేసి, ఆక్రమణకు గురైన తమ భూమిని అప్పగించాలంటూ నిరవధిక దీక్షకు దిగారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ సాంబశివప్రసాద్, ఎస్సై హరీష్‌కుమార్, ఆర్ఐ దుర్గాశ్రీనివాస్ దీక్షా శిబిరానికి చేరుకుని, ఆందోళనకారులతో మాట్లాడారు. ఈ విషయంపై పీఓటీ చట్టం ప్రకారం ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి, తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు దీక్షను విరమించారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపల్లి గ్రామానికి చెందిన చింతా వెంకటరమణ, బళ్ల శ్రీను, కుసుమే శ్రీను, యలమంచిలి రమేష్‌బాబు, కుంచే శ్రీనుబాబు, కాట్రు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరణ

అమలాపురం రూరల్: రంగాపురం సహకార సంఘ కార్యాలయంలో 2024 క్యాలెండర్‌ను జిల్లా సహకార అధికారి ఎ.రాధాకృష్ణారావు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి సంఘం అధ్యక్షుడు మామిళ్లపల్లి రాజారావు అధ్యక్షత వహించారు. రాధాకృష్ణారావు మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా అందుతున్న సేవలను రైతులు వినియోగించుకోవాలన్నారు. రంగాపురం పీఏసీఎస్ ద్వారా రైతులకు అందుతున్న సేవలను రాజారావు వివరించారు. సంఘ కరపత్రాలను ఆవిష్కరించారు. నియోజకవర్గ నోడల్ అధికారి ఎం.సూర్యనారాయణమూర్తి, అమలాపురం డీసీసీబీ మేనేజర్ విజయకుమార్, సీఈఓ యెరుబండి శివ తదితరులు పాల్గొన్నారు.

జీవితాల్లో పరివర్తన

- సారా వ్యాపారం నుంచి సక్రమ మార్గంలోకి..
- అక్రమ మద్యం వ్యాపారులకు ప్రభుత్వ పునరావాస పథకం
- సత్ఫలితాలిస్తున్న బృహత్తర కార్యక్రమం



తాళ్లరేవులో పరివర్తన ద్వారా ప్రారంభించిన దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఈబీ సీఐ భవాని, ఎస్సై కుమార్ (ఫైల్)

తాళ్లరేవు: దశలవారీ మద్య నిషేధం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అనేక పునరావాస పథకాలను అమలు చేస్తోంది. సరైన పనిలేక, పెట్టుబడికి ఆర్థిక స్థోమత లేక అక్రమ వ్యాపారాల బాట పట్టిన వారిని సక్రమ మార్గంలో పెట్టేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పరివర్తన కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది.

అక్రమ వ్యాపారాలైన నాటుసారా, అక్రమ మద్యం, గంజాయి వంటి వాటికి అలవాటు పడి, కుటుంబాలను ఛిద్రం చేసుకుంటున్న వారిని సక్రమ మార్గంలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం పునరావాస పథకాలను అమలు చేస్తోంది. అక్రమ వ్యాపారంలో మగ్గుతున్న వారిని గుర్తించి, వారి కుటుంబాలకు ప్రభుత్వం పరివర్తన కార్యక్రమం ద్వారా ఆర్థిక సాయం అందజేస్తోంది. తద్వారా వారి జీవన విధానంలో మార్పులు తెచ్చి, వారిని సన్మార్గంలో పెట్టడమే ప్రభుత్వ లక్ష్యం. ఈ మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పర్యవేక్షణలో వివిధ రకాల జీవనోపాధులను ఏర్పాటు చేసి, వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. ఇప్పటివరకు ముమ్మిడివరం నియోజకవర్గంలో సుమారు 20 మందికి పైగా ఈ పునరావాస పథకం ద్వారా లబ్ధి చేకూరింది. ఈ పథకం ద్వారా రూ.50 వేల నుంచి సుమారు రూ.5 లక్షల వరకు పాన్, కిరాణా, పశువుల పెంపకం తదితర స్వయం ఉపాధి వ్యాపారాలకు సంబంధించి రుణాలు అందజేస్తున్నారు. వాటితో వ్యాపారాలు చేసుకుంటూ, కుటుంబాన్ని పోషించుకుంటూ గౌరవంగా జీవనం సాగిస్తున్నారు.

నాకు కొత్త జీవితాన్నిచ్చారు



సారా విక్రయిస్తూ జీవితాన్ని వెళ్లదీసే నాకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి కొత్త జీవితాన్ని ప్రసాదించింది. పునరావాస చర్యల్లో భాగంగా జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందించింది. ఆ సొమ్ముతో ఇంటి వద్దే కిరాణా, జనరల్ దుకాణాన్ని ప్రారంభించాను. ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంతో వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుని గౌరవంగా బతుకుతున్నాను. దుకాణం ఏర్పాటు ద్వారా వచ్చే డబ్బులతో జీవనం సాగిస్తూ, పిల్లలను బాగా చదివించుకోవడంతో పాటు ప్రభుత్వ రుణాన్ని ప్రతి నెలా కొద్దికొద్దిగా తీరుస్తున్నాను. సీఎం జగనన్నకు కృతజ్ఞతలు.

– పెంకే భవాని, తాళ్లరేవు

వారి జీవితాల్లో వెలుగు నింపేందుకే..



అక్రమ వ్యాపారాలకు అలవాటు పడి కుటుంబాలను ఛిద్రం చేసుకుంటున్న వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం పునారావస కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. దీనిద్వారా అక్రమ వ్యాపారంలో మగ్గుతున్న వారిని గుర్తించి వారి కుటుంబాలను మంచి దారిలో పెట్టేందుకు ప్రభుత్వం పరివర్తన కార్యక్రమం ద్వారా ఆర్థికసాయం చేస్తోంది. ఇప్పటివరకు తాళ్లరేవు ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలో ఎనిమిది మందికి ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయానికి ప్రతిపాదించాం. ఇప్పటికే కొందరు కిరాణా వ్యాపారం, మరికొందరు పాడిగేదెలను కొనుక్కొని, పాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు.

– జీవీ భవాని, సీఐ, సెబ్, తాళ్లరేవు



తాళ్లరేవులో సమావేశమైన ఆక్వా రైతులు, కొనుగోలుదారులు

మార్కెట్ ధరకే చేపలు కొనాలి

ఆక్వా రైతులు, కొనుగోలుదారుల సమావేశం

తాళ్లరేవు: ఆక్వా రైతాంగానికి నష్టం కలగకుండా మార్కెట్ ధరకే చేపలు కొనుగోలు చేయాలని, తాళ్లరేవు మండలం ఆక్వా రైతుల సంఘం నాయకులు కోరారు. శుక్రవారం తాళ్లరేవు పంచాయతీ శ్రీరంగనాయకపురంలోని ఎంటీ రాజు బంగ్లాలో సమన్వయకర్త నడింపల్లి వినోద్ ఆధ్వర్యంలో ఆక్వా రైతులు, కొనుగోలుదారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రైతులు, కొనుగోలుదారులు పలు అంశాలపై కూలంకషంగా చర్చించారు. పలువురు రైతులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను కొనుగోలుదారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇష్టానుసారంగా మార్కెట్ ధరలు తగ్గించరాదని, అరువు లేకుండా మార్కెట్ ధరకే రైతు వద్ద చేపలు కొనుగోలు చేయాలని, చేపలు కిలో ఒక్కంటికి రూ.25 పైసలు మాత్రమే కమిషన్ తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా కొనుగోలుదారులు టన్నుకు రూ.2 వేలు రైతుకు అడ్వాన్సుగా చెల్లించాలని కోరారు. ఆయా సమస్యలపై కొనుగోలుదారులు సానుకూలంగా స్పందించారు. అదేవిధంగా కొనుగోలుదారులు కూడా రైతులకు కొన్ని నిబంధనలు పెట్టారు. కట్ల(బొచ్చు చేప) టన్నుకు మూడు ట్రేలు కచ్చితంగా ఇవ్వాలని, లేనిపక్షంలో ఒక ట్రేకు రూ.500 చొప్పున కొనుగోలుదారులకు చెల్లించాలన్నారు. అలాగే రైతు ఇస్తానన్న సరకు ఇవ్వలేని ఎడల కొనుగోలుదారుకు టన్నుకు రూ.6,500 చెల్లించాలన్నారు. ఈ మేరకు ఇరుపక్షాలు పలు తీర్మానాలు చేసుకున్నారు.

ఆరుగురు సభ్యులతో నూతన కమిటీ ఏర్పాటు

ఆక్వా రైతుల సమస్యల పర్యవేక్షణకు ప్రాంతాల వారీగా ఆరుగురు సమన్వయకర్తలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిలో గొట్టుముక్కల నాగరాజు(మణిరాజు), కాలాడి కామేశ్వరరావు, నిమ్మకాయల సత్యనారాయణ మూర్తి, మల్లిపూడి సత్యనారాయణ, యాళ్ల వెంకన్న మేడిశెట్టి కృష్ణ ఉన్నారు.

ఆక్వా సంఘం ఏర్పాటు శుభపరిణామం

ఆక్వా రైతుల సమస్యలపై రైతులందరూ కలిసి నూతన సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం శుభపరిణామమని మత్స్యశాఖ అధికారి గోపి అన్నారు. సమావేశానికి హాజరైన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రైతులందరూ ఐక్యతతో ఉండడం వల్ల సమస్యలను సులువుగా పరిష్కరించుకోవచ్చన్నారు. అందరూ ఒకేమాట ప్రకారం సాగు చేయడం వల్ల మంచి దిగుబడులు వస్తాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆక్వా రైతులు బొడ్డు సత్యనారాయణ, అంజిబాబు, వేలూరి సూర్యనారాయణ, వైదాడి ధర్మారావు, ధూళిపూడి చిట్టిబాబు, సతీష్, చంటి, కొనుగోలుదారులు గొర్రిపూడి శ్రీను, భజన సత్తిబాబు, బుజ్జి, మురళి తదితరులు పాల్గొన్నారు.

పోలేకుర్రులో ఉచిత మెగా వైద్య శిబిరం



పోలేకుర్రు వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

తాళ్లరేవు: తాళ్లరేవు మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పోలేకుర్రులో ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. ఇందులో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పోలేకుర్రు పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, ఎండీయూ డబ్ల్యూఏ అధ్యక్షుడు పెయ్యల రమేష్ ప్రారంభించారు. తాళ్లరేవు సూర్యా మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ వైద్యులు ధర్మేంద్ర రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి చైర్మన్ మత్సా గంగాధర్, సంఘ ప్రతినిధులు తాడి షణ్ముఖరాజు, విప్పర్తి శ్రీనివాస్, బళ్ల సంధ్యారాణి, విశ్వజన కళామండలి జిల్లా అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన



సంక్షేమ పథకాల అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సర్పంచ్ సాధనాల వెంకటరావు

అల్లవరం: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంలో కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై దేవగుప్తం, డి.రావులపాలెం గ్రామాల్లో అవగాహన కల్పించారు. సర్పంచ్‌లు సాధనాల వెంకటరావు, ఉండ్రు భగవాన్‌దాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అర్హులైన లబ్ధిదారులకు అందిస్తున్న 17 రకాల సంక్షేమ పథకాలపై ఏపీఎం సయ్యద్ వివరించారు. అర్హత ఉండి ఎవరికైనా సంక్షేమ పథకాలు వర్తించకపోతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ ఈతకోట సతీష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, బీజేపీ మండల అధ్యక్షుడు సుంకర సాయి, కార్యదర్శి పి.శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వత్సవాయి వర్ధంతి

యానాం: అయ్యప్పస్వామి మహిమల దీక్షలపై విస్తృత ప్రచారం చేసిన దివంగత గురుస్వామి వత్సవాయి వరహాలరాజు వర్ధంతిని స్థానిక గౌతమీ గోదావరి తీరంలో ఉన్న దత్తమణికంఠ ఆలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వరహాలరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. చెక్కా నూకరాజు గురుస్వామి, దత్తమణికంఠ పూజా మందిరం, జ్యోతిదర్శన యాత్ర స్వాములు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఉప్పలగుప్తం: భీమనపల్లి శ్రీరంగు రంగనాయకమ్మ జెడ్పీ హైస్కూల్‌లో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు అత్తిలి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో సంఘ క్యాలెండర్లను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కె.మధు, ఏ.నాయుడు, కె.జార్జి, జె.సురేష్‌కుమార్, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రామస్పర్శ అక్షతల పంపిణీకి ఏర్పాట్లు

యానాం: జనవరి 22న అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక గోపాల్‌నగర్‌లో శారదాదేవి గుడిలో శ్రీరామ స్పర్శ అక్షతలు ప్యాకింగ్ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. జనవరి ఒకటి నుంచి ఏడు వరకు యానాం, పరిసర ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి అక్షతలు ఇచ్చేలా కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు వాసవీ భక్త బృందం సభ్యులు తెలిపారు. అక్షతలతో పాటు రామజన్మభూమి తీర్థక్షేత్రం వారు పంపిన ఆహ్వాన పత్రం, రామమందిర చిత్రపటం ఇవ్వనున్నట్టు వివరించారు.

దివ్యాంగ పాఠశాల సందర్శన



దివ్యాంగ విద్యార్థులతో డైరెక్టర్ ముత్తుమీనా తదితరులు

యానాం: ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ రివర్ బీచ్ వద్ద నిర్వహిస్తున్న మానసిక దివ్యాంగుల పాఠశాలను శుక్రవారం పుదుచ్చేరి డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ముత్తు మీనా సందర్శించారు. ఈ సందర్భంగా దివ్యాంగ పిల్లలకు అందిస్తున్న ప్రత్యేక విద్య కార్యక్రమాలను స్వయంగా చూసి, ప్రిన్సిపాల్ ఎస్‌ఏ నాయుడుతో మాట్లాడారు. సంస్థ ఈడీ ఎస్‌పీ రెడ్డి మానసిక వికలాంగులకు వసతులతో కూడిన విద్యను అందిస్తున్న విధానాన్ని, కార్యక్రమాలను అభినందించారు. అనంతరం కొంతసేపు దివ్యాంగ పిల్లలతో ఆమె ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ అమాలోర్‌పావమేరీ, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ శ్రీనివాసు పాల్గొన్నారు.

కామన గరువులో 'ఆడుదాం ఆంధ్రా'



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ అరుణకుమారి

అమలాపురం రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు శుక్రవారం బాలయోగి స్టేడియంలో జరిగాయి. క్రికెట్ మ్యాచ్‌తో పాటు కామన గరువు జెడ్పీ హైస్కూల్‌లో వాలీబాల్ పోటీలను సర్పంచ్ నక్కా అరుణకుమారి ప్రారంభించారు. గ్రామ స్థాయిలో క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ప్రభుత్వం ఈ పోటీలను నిర్వహిస్తోందన్నారు. ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, స్కూలు హెచ్‌ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల సంతకు సంక్రాంతి శోభ



పందెం పుంజుల అమ్మకాలతో సందడిగా మారిన ఆర్యావటం కోళ్ల సంత

కాజులూరు: మండలంలోని ఆర్యావటం సంత మార్కెట్‌లో పందెం కోడిపుంజుల అమ్మకాలు జోరుగా సాగాయి. ప్రతి శుక్రవారం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఉన్న మార్కెట్‌లో కోళ్ల సంత జరుగుతుంది. పరిసర గ్రామాల్లోని మహిళలు, రైతులు నాటుకోళ్లను తీసుకువచ్చి ఇక్కడ అమ్మకాలు నిర్వహిస్తుంటారు. కాకినాడ, రామచంద్రపురం, యానం తదితర పట్టణాల నుంచి పలువురు వ్యాపారులు వీటిని కొనుగోళ్లు చేసి వారి ప్రాంతాలకు తీసుకువెళ్లి అక్కడ మరలా మారు విక్రయాలు చేస్తుంటారు. ప్రతి వారం ఇది పరిపాటిగా జరిగే సంఘటనే. అయితే సంక్రాంతి దగ్గర పడటంతో సందట్లో సడేమియా అన్నట్టు గత రెండు, మూడు వారాలుగా కోళ్ల సంతలో పందెం పుజుల వ్యాపారం హుషారుగా సాగిపోతుంది. సంక్రాంతి వచ్చిందంటే నియోజకవర్గ గ్రామాల్లో కోడి పందాలు జోరుగా సాగుతుంటాయి. దీంతో పందెం పుంజులకు మంచి గిరాకీ ఉండటంతో ఏజెన్సీ ప్రాంతమైన ఏలేశ్వరం, రంపచోడవరం, ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి పలువురు పందెం పుంజులను తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. కాకి, నెమలి, డేగ, పూల, పచ్చకాకి వంటి జాతుల కోళ్లను ఈ శుక్రవారం సంతలో విక్రయించారు. జాతులను బట్టి ధర రూ.20 వేలు నుంచి రూ.లక్ష వరకూ అమ్మకాలు జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. కోడిపందాల నిర్వహణకు అనుమతి లేకపోయినప్పటికీ కోళ్లకు కత్తులు కట్టనంతవరకూ కేసులు నమోదుకు అవకాశం లేకపోవటంతో పందెంపుంజులు విక్రయించినా పోలీసులు పట్టుకుని కేసులు పెట్టలేకపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. అయితే ఇక్కడ కోళ్లసంత నిర్వహణకు పూర్వం నుంచి అనుమతులు ఉండటంతో కోళ్లసంత మాటున పందెంపుంజుల వ్యాపారం సాగిపోవటానికి మరో కారణంగా ఉంది. మరోపక్క కోళ్లసంతలో పందెంపుంజులు విక్రయాలు చూస్తుంటే ఈ సంక్రాంతికి మండల పరిసర గ్రామాల్లో కోడి పందాలు ఏ స్థాయిలో ఉంటాయో అర్థం చేసుకోవచ్చని స్థానికులు అంటున్నారు.

12న గోదావరి జోనల్ బాడీ బిల్డింగ్, ఫిజిక్స్ స్పోర్ట్స్ పోటీలు



మాట్లాడుతున్న బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నాయుడు, కోచ్ వెంకటేశ్వరరావు

అమలాపురం టౌన్: శ్రీస్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా 2024 జనవరి 12వ తేదీన అమలాపురం దుడ్డివారి అగ్రహారంలోని ఆఫీసర్స్ రిక్రియేషన్స్ క్లబ్‌లో 2వ గోదావరి జోనల్ బాడీ బిల్డింగ్, ఫిజిక్స్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్–2024 పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు వెల్లడించారు. స్థానిక హెల్త్ ఫిట్నెస్ జిమ్‌లో శుక్రవారం జరిగిన అసోసియేషన్ జిల్లా సమావేశంలో ఈ పోటీలకు సంబంధించిన వివరాలను జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావుతో కలిసి వెల్లడించారు. ఈ పోటీలకు ఆరు జిల్లాల నుంచి సుమారు 250 మంది బాడీ బిల్డర్లు హాజరవుతారని చెప్పారు. ఈ పోటీలను నాలుగు విభాగాలుగా అంటే బాడీ బిల్డింగ్, మాస్టర్స్, దివ్యాంగ, ఫిజిక్స్ స్పోర్ట్స్‌గా నిర్వహిస్తామన్నారు. ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ నిర్వాహక కార్యదర్శి, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ రంకిరెడ్డి కాశీ చాంపియన్ షిప్ నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

చేను దర్పణంలో కొబ్బరందాలు!



ప్రకృతి కాన్వాస్‌పై కొబ్బరి చెట్ల ప్రతిబింబాలు

అలసి సొలసిన భానుడు పశ్చిమాన ఒదుగుతున్న వేళ..పంట చేలో కొబ్బరి చెట్లు తమ ప్రతిబింబాన్ని చూసుకుని మురిసిపోయినట్టుగా ఉందా దృశ్యం. పంట చేను అద్దంలో పచ్చని చెట్లు తమ సోయగాలను చూసుకుంటున్నట్టున్న ఈ దృశ్యం ప్రకృతి ప్రేమికులను అలరించింది. రాయవరం శివార్లలో శుక్రవారం నయన మనోహరంగా ఉన్న ప్రకృతి చిత్రమిది.

– రాయవరం

జాతరకు సన్నాహాలు



కేశవరంలో జాతర విద్యుద్దీపాలంకరణ టెండరు ప్రక్రియలో ప్రముఖులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం కేశవరం గ్రామ శివార్లలో కనుమ పండుగ రోజు నుంచి నిర్వహించే గని పోతురాజు తీర్థ మహోత్సవాల ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు ప్రారంభించారు. ఆలయ కమిటీ చైర్మన్ కూసు నరసింహమూర్తి, ఈఓ శ్రీనివాసరావు సమక్షంలో జాతర సందర్భంగా విద్యుత్ దీపాలంకరణకు శుక్రవారం టెండరు ప్రక్రియ నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడికి చెందిన వ్యక్తి రూ.1.15 లక్షలకు ఈ టెండరును ఖరారు చేశారు. కొబ్బరి చెక్కలు సేకరించుకునే టెండరును జనవరి 5న నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, నాయకులు కొప్పిరెడ్డి ప్రసాద్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తుపాకుల ప్రసన్నకుమార్, కొక్కిరి కామేశ్వరరావు, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.